క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

తవణంపల్లె: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు జాగ్రత్తగా మెలగాలని డాక్టర్ వినయ్ కుమార్ తెలిపారు. మండలంలోని ఎ.గొల్లపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 మొబైల్ క్లినిక్‌లో గర్భిణులు, బాలింతలు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. 35 మందికి వైద్య పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. వైద్య బృందం ఇంటింటికీ వచ్చి వైద్య సేవలందిస్తున్నారని వివరించారు. జ్వరం సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్యం



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సంధ్య

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని వైద్యాధికారి సంధ్య అన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని తుమ్మిందపాళ్యంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇందులో 65 మందికి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది రాధిక, రాజేశ్వరి, నందిని, వశిత, నిరోష పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పూజ



పాలేరులో అయ్యప్పస్వామి పూజలు చేస్తున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని పాలేరు గ్రామంలో బుధవారం రాత్రి అయ్యప్పస్వామి అంబళ పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో అయ్యప్ప మాల ధరించిన భక్తులు స్థానిక రామాలయం కల్యాణ మండపంలో గురుస్వామి వెంకటాద్రి ఆధ్వర్యంలో అంబళ పూజలు చేశారు. అరటి పట్టలతో ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేసి అయ్యప్పస్వామి చిత్రపటాన్ని కొలువుదీర్చారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసి, గ్రామంలో అన్నదానం చేశారు.

ఉద్యాన పంటల్లో సస్యరక్షణ చర్యలు

వి.కోట: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఉద్యాన పంటలో తెగుళ్ల ఎక్కువయ్యే ఆవకాశం ఉందని ఉద్యానశాఖాధికారిణి లక్ష్మీ ప్రసన్న సూచించారు. ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాల కారణంగా వాతవరణంలో అత్యధిక తేమ ఉండడం వలన టామాట వంటి పంటల్లో కాయలు పగిలిపోయే ఆవకాశం ఉందని పంటపై భోరాన్ 1 గ్రామ్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అదేవిధంగా పూల తోటల్లో గాలిలో తేమ అధికంగా ఉండడం వలన బూడిద తెగులు ఆసించే ఆవకాశం ఉందని దాని నివారణకు మైక్లోబ్యూటానిల్ 1 గ్రాము లేదా మిథైల్ 1 గ్రామ్‌ను లీటర్ నీటికి కలిపి వారంలో రెండుసార్లు పిచికారీ చేయాలని సూచించారు.

కామాక్షమ్మపై పచ్చ తోడేళ్ల కన్ను



కామాక్షమ్మ చెరువులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

ఇసుక ఉచితం అని ప్రకటించిన ప్రభుత్వం.. సామాన్యులకు అందకుండా చేసేసింది. వాగులు, వంకలు, చెరువుల్లో ఉన్న ఇసుకనంతా అధికార పార్టీ నేతలు అక్రమంగా తమ పొలాల్లోకి తరలించి నిల్వ చేసుకుంటున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా యథేచ్ఛగా ట్రాక్టర్లతో తరలించేస్తున్నారు. అధికారులకు తెలిసినా తెలియనట్లు మౌనం పాటిస్తున్నారు. చెరువులో నిబంధనలకు విరుద్ధంగా ఐదు అడుగుల మేరకు మట్టి తవ్వి, భూగర్భంలోపల ఉన్న ఇసుకను బయటకు తీసి సొమ్ము చేసుకుంటున్నారు. కామాక్షమ్మ చెరువును ఈ ఇసుక తోడేళ్లు చుట్టేముట్టి వేటాడుతున్నాయి.

- చెరువులో అక్రమంగా ఇసుక తవ్వకాలు
- టీడీపీ కార్యకర్తలకు కాసుల పంట
- సామాన్యుడికి అందని ఉచిత ఇసుక

బంగారుపాళెం: ఇసుక అక్రమ రవాణా తెలుగు తమ్ముళ్లకు కాసుల పంట కురిపిస్తోంది. మండలంలోని బలిజపల్లె కామాక్షమ్మ చెరువులో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపట్టి రాత్రికి రాత్రే తరలిస్తున్నారు. కామాక్షమ్మ చెరువు సమీపంలోనే ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణ పనులు సాగుతున్నాయి. చెరువుకు దగ్గరగా ఉండడంతో సంబంధిత కాంట్రాక్టర్లు ఇటాచి, జేసీబీలను ఉపయోగించి టిప్పర్ల ద్వారా మట్టిని తీసుకు వెళ్లి రోడ్డు పనులకు వినియోగించుకుంటున్నారు. చెరువు లోతుగా తవ్వేయడంతో ఇసుక పొరలు బయట పడ్డాయి. ఇదే అదునుగా అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు చెరువులో ఇసుకపై కన్నేశారు. కొన్ని రోజులుగా చెరువులో అక్రమంగా ఇసుకను తవ్వుకుంటున్నారు. దాన్ని తీసుకెళ్లి తమ సొంత పొలాల్లో డంప్ చేసుకుంటున్నారు. ట్రాక్టర్ ఇసుక డిమాండ్‌ను బట్టి రూ.3,500 నుంచి 4 వేలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. పగలూ, రాత్రి తేడా లేకుండా చెరువులో ఇసుక తరలిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.



చెరువులో ఇసుక తోడడంతో ఏర్పడిన గుంతలు



డంప్ చేసిన ఇసుక

ఐదు అడుగుల మేరకు తవ్వకాలు

ఎక్స్‌ప్రెస్ హైవే పనుల కోసం కామాక్షమ్మ చెరువులో మట్టి తవ్వకాలు మొదలెట్టారు. నిబంధనల మేరకు రెండు మూడు అడుగుల మేరకు మాత్రమే తవ్వకోవలసి ఉంది. అయితే హైవే పనులు చేసే సిబ్బందికి ఇసుకాసురులు డబ్బుల ఆశ చూపి నిబంధనలను పక్కన పెట్టి ఐదు అడుగుల వరకు తవ్విస్తున్నారు. ఐదు అడుగుల కింద ఉన్న ఇసుక పొరలను బయటకు తీస్తున్నారు. హైవే పనుల ముసుగులో ఇసుకను సొంత పొలాల్లోకి తరలించేస్తున్నారు.

సామాన్యులకు అందని ఇసుక

పేరుకే ఇసుక ఉచితం అని ప్రకటించారు కానీ, ఎక్కడా ఇసుక మాత్రం దొరకడం లేదు. నాలుగు నెలలుగా ఇసుక కష్టాలు ప్రజలను వెంటాడుతూనే ఉన్నాయి. వేలకు వేలు వెచ్చించి రోజుల తరబడి ఎదురుచూస్తే గానీ ఇసుక దొరకని పరిస్థితి నెలకొంది. సామాన్యులు ఇళ్లను నిర్మించుకోవాలంటే ఇసుక దొరకడం కష్టంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుక అందజేస్తామని చెప్పి నగదు వసూలు చేయడంతో పాటు ఇసుక రీచ్‌లు అందుబాటులో ఏర్పాటు చేయలేదు. పేద ప్రజలు దూర ప్రాంతాల రీచ్‌ల నుంచి ఇసుక తెచ్చుకోవడానికి బాడుగ చెల్లించలేక ఆర్థిక పరమైన అవస్థలు పడుతున్నారు. పరిస్థితి ఇలా ఉంటే పేదోళ్లకు ఇల్లు కట్టుకునేది ఎలా అని వాపోతున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు

గత మూడు నెలలకు పైగా కామాక్షమ్మ చెరువులో ఇసుక అక్రమంగా రవాణా జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించలేవు. దీనిపై స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని చెబుతున్నారు. ఇసుకాసురులు అందరూ అధికార పార్టీ వారే కావడంతో అధికారులు నోరు మెదపడం లేదు. చెరువులో అక్రమ తవ్వకాలు చేపట్టకూడదని పోలీసులు హెచ్చరించినా తమ్ముళ్లు బేఖాతర్ అంటున్నారు.

రైతుల ఆందోళన

ఇసుక కోసం చెరువులను పెద్ద పెద్ద బావులుగా తవ్వేశారు. భూమి లోపల పొరల్లో ఉన్న ఇసుకను తరలించేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తోడేస్తుండడంతో కామాక్షమ్మ చెరువు పెద్దపెద్ద గుంతలతో నిండిపోయింది. ఇప్పటికైనా ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయడానికి రైతులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



మండలంలోని బలిజపల్లె కామాక్షమ్మ చెరువులో అనధికారికంగా ఇసుక తరలిస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. చెరువుల్లో ఇసుక తరలించడానికి ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. నిబంధనలకు విరుధంగా చెరువులు, కాలువల్లో ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు చేపట్టరాదు. అక్రమంగా ఇసుక తరలించేవారిపై ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.
–బాబురాజేంద్రప్రసాద్, తహసీల్దార్, బంగారుపాళెం

శ్రీకృష్ణ దేవరాయల వర్ధంతి

తవణంపల్లె: మండలంలోని అరగొండ పాత బస్టాండులో గురువారం శ్రీకృష్ణ దేవరాయల వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూజలు చేసి గజమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రాయలవారి సేవలను కొనియాడారు. కార్యక్రమాన్ని అరగొండ బాలికల హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయులు ఈశ్వర్ శెట్టి, విశ్రాంత ఉపాధ్యాయులు గిరీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

20న ద్రవిడ వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం

గుడుపల్లె: కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయం 27వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఈనెల 20న వర్సిటీ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ వేడుకలకు విశ్వవిద్యాలయంలోని అన్నిశాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బాల వికాస్ సెంటర్ ప్రారంభం



పిల్లలకు బోధన చేస్తున్న సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం సంతపేటలోని శ్రీవిద్యాగణపతి ఆలయ ప్రాంగణంలో గురువారం సత్యసాయిసేవా సంస్థల ఆద్వర్యంలో బాల వికాస్ సెంటర్‌ను ప్రారంభించారు. సంస్థ జిల్లా అధ్యక్షులు మధుసూదనం సైలెంట్ సెట్టింగ్, శ్లోకం, పద్య సూక్తులు, పద్య సూక్తులు, చిన్న నీతి కథలు, మెయిడ్‌గేమ్స్, పరిశుభ్రత, చిత్రలేఖనం, సంగీతం, నాట్యం తదితర అంశాలపై పిల్లలకు బోధన చేశారు. సభ్యులు దేవరాజులు, గజేంద్ర రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, శంకర్, చంద్ర ప్రసాద్, వసంత, సాయి లక్ష్మి, శేషనారాయణ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక గ్రంథాలయం ప్రారంభం



బ్రహ్మానందాశ్రమంలో ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న దాత షణ్ముగంపిళ్లై

బంగారుపాళెం: మండలంలోని మాధవనగర్ బ్రహ్మానందాశ్రమంలో గురువారం ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని దాతలు ప్రారంభించారు. బంగారుపాళ్యానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు మధురాంతకం షణ్ముగంపిళ్లై తన తండ్రి గోవిందపిళ్లై జ్ఞాపకార్థం ఆశ్రమం ఆవరణలోని కల్యాణ మండపంలో ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ ఆశ్రమానికి వచ్చే భక్తులు సౌకర్యంగా గ్రంథాలయంలో వివిధ రకాల ఆధ్యాత్మిక పుస్తకాలను అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కరణం సంక్షేమ సంఘం సభ్యులు రవీంద్ర ప్రసాద్, శంకరన్,హరిహరప్రసాద్, రవి, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యత ముఖ్యం



మాట్లాడుతున్న పీవీకేఎన్ అధ్యాపకులు గోపీనాయక్

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులకు సామాజిక బాధ్యత ముఖ్యమని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు గోపినాయక్ అన్నారు. ఆ కళాశాలలో గురువారం అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని సామాజిక బాధ్యత అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పేదరికం ఒక సవాలుగా మారిందన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పేదరిక నిర్మూలన దినోత్సవం సామాజిక బాధ్యతను గుర్తు చేస్తుందని చెప్పారు. సమాజంలోని ప్రతి వ్యక్తి పేదరికాన్ని తగ్గించే చర్యల్లో భాగస్వామిగా మారాలని అన్నారు. పేదరికం కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదని తెలిపారు. ఇది విద్యా, ఆరోగ్యం, జీవన ప్రమాణాలతో ముడిపడి ఉన్న సమస్యగా మారిందని చెప్పారు. పేదరికం నిర్మూలనకు ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు, సమాన వేతనాలు కీలకమని వివరించారు. అధ్యాపకులు చెన్నకేశవులు మాట్లాడుతూ పేదరికాన్ని తగ్గించేందుకు సరైన విధానాలు తీసుకోవాలని తెలిపారు. మౌలిక వసతుల అభివృద్ధి తప్పనిసరని అభిప్రాయపడ్డారు. ఈ అవగాహన కార్యక్రమంలో అధ్యాపకులు కోటేశ్వరరావు, రాజేష్, ఉమాదేవి, రెడ్డిబాషా పాల్గొన్నారు.

పీవీకేఎన్ లో డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు. 2024–25 విద్యాసంవత్సరంలో డిగ్రీలో చేరాలనుకునే విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్‌ల సౌకర్యం కల్పించారన్నారు. ఈ నెల 20వ తేదీలోపు అర్హత, ఆసక్తి ఉన్న వారు కళాశాలలో సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 9985165051ను సంప్రదించాలని కోరారు.

శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం

కాణిపాకం: పౌర్ణమిని పురస్కరించుకుని కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన అనుబంధ దేవాలయమైన శ్రీదేవి భూదేవి సమేత వరదరాజస్వామి ఆలయంలో గురువారం సత్యనారాయణ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలోని వేదపండితులు మూలస్థానంలోని దేవతామూర్తులకు అభిషేక పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం సత్యనారాయణవ్రతాన్ని ఆచరించారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: ప్రజలు నివాస ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత సూచించారు. మండలంలోని నెల్లిమందపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 70 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ మాట్లాడుతూ రాత్రి సమయంలో దోమకాటుకు గురికాకుండా వేపాకు పొగ, దోమ తెరలను తప్పనిసరిగా వాడాలని సూచించారు. జ్వరం సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపరుచుకోవాలన్నారు. వర్షాలు కురుస్తుండడంతో కాచి చలార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మినిస్టీరియల్ ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలి



సీఈఓ రవికుమార్‌నాయుడుకు విన్నవిస్తున్న ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీపరిధిలో పనిచేస్తున్న మినిస్టీరియల్ ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని ఉద్యోగులు కోరారు. జెడ్పీ కార్యాలయంలో గురువారం సీఈఓ రవికుమార్‌నాయుడిని మినిస్టీరియల్ ఉద్యోగులు కలిసి తమ సమస్యను విన్నవించారు. కొన్ని సంవత్సరాలుగా అటెండర్, జూనియర్, సీనియర్ సహాయకులు పదోన్నతి లేకుండా పనిచేస్తున్నారని చెప్పారు. దీనిపై కొందరు పలు కారణాలతో కోర్టును ఆశ్రయించారని చెప్పారు. వారు పెట్టిన కేసును ప్రస్తుతం విత్ డ్రా చేసుకున్నట్లు వివరించారు. పలు ప్రాంతాల్లో ఖాళీలు ఉన్నందున తమకు పదోన్నతి కల్పించి, వాటిని భర్తీ చేయాలని కోరారు. ఖాళీలను పరిశీలించి ఉద్యోగులకు పదోన్నతి కల్పిస్తామని సీఈఓ హామీనిచ్చారు. కార్యక్రమంలో జిల్లా మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు పెద్దపీట



సిమెంటు రోడ్డుకు భూమి పూజ చేస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్

తవణంపల్లె: పూతలపట్టు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తామని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని జోగివారిపల్లె, కంపలపల్లె, గురుకువారిపల్లె, కొండ్రాజుకాలువ, ఈచనేరి గ్రామాల్లో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు నిర్మిస్తామన్నారు. నియోజకవర్గంలో రహదారులను పూర్తి చేసి, గోకులం షెడ్లు నిర్మిస్తామన్నారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డిబాబు, తహసీల్దార్ సుధాకర్, ఏపీడీ సుబ్రమణ్యం, ఏపీఓ లలిత, ఏపీఎం రవి, టీడీపీ నాయకులు వెంకటేశ్వరచౌదరి, దిలీప్, మోహన్‌నాయుడు, భాస్కర్‌నాయుడు, సర్పంచ్ రవిచంద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

సిలిండర్ రాలేదు.. మెసేజ్ వచ్చింది

- నెల రోజులుగా అందని గ్యాస్
- డెలివరీ అయినట్లు ఫోన్లకు మెసేజ్‌లు
- ఖాతాల్లో సబ్సిడీ నగదు జమ
- గ్యాస్ ఏజెన్సీ కార్యాలయానికి తాళం
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు

Your A/C XX2169 is credited with Rs. 19.74 on 14-10-24 for IOAP34D APB. Avl Bal: Rs. 2060.73-IPPB
4:53 pm

సబ్సిడీ నగదు జమ అయినట్లు వచ్చిన మెసేజ్

గుడిపాల: రెండు నెలల ముందు గ్యాస్ బుక్ చేసిన రెండు రోజుల్లోనే ఇంటికి గ్యాస్ సిలిండర్ వచ్చేది. లేకుంటే మరో రెండు రోజులు ఆలస్యంగా గ్యాస్‌ను సరఫరా చేస్తుంటారు. అయితే మండలంలో ఇప్పుడు నెల రోజులైనా గ్యాస్ సిలిండర్ డెలివరీ కావడం లేదు. దీంతో లబ్ధిదారులు నానా అవస్థలు పడుతున్నారు. కొంత మంది గృహిణులు గ్యాస్ సిలిండర్లు లేక బ్లాక్ మార్కెట్‌లో తీసుకొని వంట చేస్తున్నారు. మండలానికి ఇండేన్ గ్యాస్‌కు సంబంధించి నాలుగు ఏజెన్సీలు గ్యాస్‌ను సరఫరా చేస్తున్నాయి. ఇందులో అమరావతి, గృహప్రియ, హిమజ, మదర్‌మారియా ఏజెన్సీ వారు సరఫరా చేస్తున్నారు. వీరందరూ కూడా చిత్తూరు నుంచి సరఫరా చేస్తున్నారు. ఇందులో మదర్‌మారియా గ్యాస్ ఏజెన్సీ నుంచి సిలిండర్లు మాత్రం నెలరోజులుగా రావడం లేదు. దీనికి సంబంధించి కార్యాలయం, గోడౌన్ చిత్తూరులోని ప్రశాంత్‌నగర్‌లో ఉన్నాయి. ఫోన్‌చేస్తే ఆన్‌లైన్‌లో గ్యాస్ బుక్ అవుతున్నదే కానీ సిలిండర్ మాత్రం సరఫరా చేయడం లేదు. కొంత మంది వినియోగదారులు గ్యాస్ తీసుకోకుండానే డెలివరీ అయినట్లు మెసేజ్‌లు వస్తున్నాయి. దీంతో పాటు వారి బ్యాంక్ ఖాతాల్లో గ్యాస్ సబ్సిడీ నగదు రూ.19.74 కూడా జమైంది. గ్యాస్ ఏజెన్సీ వారికి ఫోన్‌చేస్తే తాత్కాలికంగా పనిచేయడం లేదని సమాధానం వస్తున్నది. గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్దకు వెళితే అక్కడ తాళాలు వేసి ఉన్నట్లు లబ్ధిదారులు తెలియజేస్తున్నారు. గ్యాస్‌బుక్ చేసి నెలరోజులు గడుస్తున్నా సిలిండర్ రావడం లేదు. ఏజెన్సీకి ఫోన్ చేస్తే పనిచేయడం లేదు. ఏజెన్సీ వారు తాళాలు వేయడంపై తమగోడు ఎవరికి చెప్పాలో దిక్కుతోచక లబోదిబోమంటున్నారు.



గ్యాస్ కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

ఫోన్ చేస్తే వాయిస్ మెసేజ్ వస్తోంది



వారం క్రితం నేను మదర్‌మారియాలో గ్యాస్ బుక్ చేశాను. సిలిండర్ మాత్రం రాలేదు. మూడురోజుల క్రితం డెలివరీ అయినట్లు మెసేజ్ వచ్చింది. 14వ తేదీన మధ్యాహ్నం నా ఖాతాలో గ్యాస్‌కు సంబంధించి సబ్సిడీ రూ.19.74 మాత్రం జమయ్యింది. ఏజెన్సీ వారికి ఫోన్ చేస్తే ఫోన్‌లు తాత్కాలికంగా సేవలు నిలిపివేయబడినవి అని వాయిస్ వస్తున్నది. గ్యాస్ సిలిండర్ ఇవ్వకుండానే ఇలా మోసం చేస్తున్నారు. అధికారులు వీటిపై వెంటనే చర్యలు తీసుకోవాలి.
– సుబ్రమణ్యం, నంగమంగళం, గుడిపాల

20 రోజులకు ముందు గ్యాస్ బుక్‌చేశా



నేను 20రోజులకు ముందు మదర్‌మారియాలో గ్యాస్ సిలిండర్‌ను బుక్‌చేశా. ఇంతవరకు సిలిండర్ డెలివరీ కాలేదు. ప్రతిరోజు మా గ్రామంలో ఖాళీ సిలిండర్‌లు పెట్టుకొని వేచి చూస్తున్నాం. ఫోన్‌చేస్తే ఫోన్ కూడా పనిచేయలేదు. గ్యాస్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. చిత్తూరులోని ప్రశాంత్‌నగర్‌లో ఉన్న గ్యాస్ ఏజెన్సీ ఆఫీసు వద్దకు వెళితే తాళం వేసి ఉన్నారు. ఎవ్వరిని అడిగినా సమాధానం చెప్పడం లేదు. ఇప్పుడేం చేయాలో కూడా అర్థం కావడం లేదు.
-కస్తూరి, వసంతాపురం, గుడిపాల

15 రోజుల నిరీక్షణ



గ్యాస్‌కోసం 15 రోజులుగా ఎదురుచూస్తున్నాం. ఫోన్ చేసినా కూడా పనిచేయడం లేదు. ప్రస్తుతం కట్టెల పొయ్యి మీద వంటలు చేస్తున్నాం. మరొక్క కంపెనీకి మారుదామంటే ఈ ఏజెన్సీ వాళ్లే మార్చాలంట. మదర్‌మారియా ఏజెన్సీ కార్యాలయానికి తాళం వేసి ఉన్నారు. సిలిండర్ మాత్రం ఇవ్వకుండా మెసేజ్‌లు వస్తున్నాయి. మేం ఇప్పుడు ఎవరికి ఫిర్యాదు చేయాలి. ప్రస్తుతం ఏం చేయాలో దిక్కుతోచలేని పరిస్థితుల్లో ఉన్నాం. సంబంధించిన అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.
-రెడ్డెమ్మ, వసంతాపురం, గుడిపాల

చిన్నపాటి చిట్కాలతో పంట రక్షణ

పెనుమూరు(కార్వేటినగరం): వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షం కారణంగా మునిగిన పంటలను చిన్నపాటి చిట్కాలతో రక్షించుకోవచ్చని ఏఓ మురళీకృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని కొండమ్మ అగ్రహారంలో మునిగిపోయిన రైతు శ్రీనివాసులురెడ్డి పంటను సందర్శించారు. మునిగిన గింజ మొలకెత్తకుండా రెండు గ్రాముల ఉప్పును ఒక లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పంట నష్టం వాటిల్లిన వారు రైతు సేవాకేంద్రంలో నమోదు చేయించుకోవాలని చెప్పారు. అనంతరం డీఆర్‌పీ నాగపద్మిని మాట్లాడుతూ వాణిజ్య పంటల సాగులో యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఏఓ పద్మజ, సంధ్యారాణి, కె.సుహర్లత పాల్గొన్నారు.